## క్లుప్తంగా

### 22న 'గడప గడపకు'

వై.రామవరం: మండలంలోని శనివారం రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పర్యటిస్తున్నట్టు ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి తెలిపారు. వారు మాట్లాడుతూ వై.రామవరం సచివాలయం పరిధిలోని గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పార్టీ శ్రేణులు తదితరులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### కోయ భాషా దినోత్సవాన్ని నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీను

ఎటపాక: విశ్వ కోయ, గోండు భాషా దినోత్సవాన్ని ఐటీడీఏలు అధికారికంగా నిర్వహించాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ నాయకుడు పూసం శ్రీను అన్నారు. ఏటీఏ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏటా భాషా పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఈ నెల 21 జరిగే విశ్వ కోయ, గోండు భాషా దినోత్సవాన్ని ప్రతి పంచాయతీల్లో నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాక రాజు, ప్రసాద్,మడివి నెహ్రూ, దారయ్య, రామకృష్ణ, నూపా అనిల్, కిరణ్ తదితరులున్నారు.

### ఉద్యాన పంటలతో రైతులకు మేలు



నిమ్మలపాడులో రైతులకు మొక్కలను అందజేస్తున్న సర్పంచ్ సన్యాసిరావు

అనంతగిరి: మండలంలోని వాలసీ పంచాయతీ నిమ్మలపాడు గ్రామంలోని బుధవారం సర్పంచ్ సెంబీ సన్యాసిరావు రైతులకు సీతాఫలం, కొబ్బరి తదితర మొక్కలను అందజేశారు. ఉద్యానవన పంటలపై ప్రత్యేక దృష్టి పెట్టి, రైతులు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశ్యంతో జాతీయ ఉపాధి హామీ పథకంలోని మొక్కలు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. ఉద్యాన పంటల సాగు రైతులకు ఎంతో మేలు చేస్తోందని, ఆర్థికాదాయం సమకూర్చుతోందన్నారు. వీఆర్పీ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

### రహదారుల అభివృద్ధికి జెడ్పీ నిధులు



జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం

గంగవరం : మండలంలో వివిధ గ్రామాల్లో గ్రావెల్ రహదారులు, సీసీ రోడ్ల నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధులు మంజూరైనట్లు జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం తెలిపారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని రహదారుల సమస్యను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సమావేశాల దృష్టికి తీసుకెళ్లగా చైర్మన్ వేణుగోపాలరావు స్పందించి మండలంలో రహదారుల అభివృద్ధికి రూ.60లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ మేరకు కొత్తాడ పంచాయతీలోని టేకులవీధికి రూ.10లక్షలు, సూరంపాలెం పంచాయతీ దోనెలపల్లికు రూ.10లక్షలు, మర్రిపాలెంలో రూ.15లక్షలు, మొల్లేరులో రూ.10 లక్షలు, నెల్లిపూడిలో రూ.10లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణానికి, పిడతమామిడిలో రూ.5లక్షలతో సీసీ రోడ్లు నిర్మించనున్నట్టు జెడ్పీటీసీ బేబీరత్నం వివరించారు.

### పారిశుధ్య పనులు ముమ్మరం



అప్పలరాజుపేట రోడ్డు వద్ద పంచాయతీ ఏర్పాటుచేసిన బోర్డు

రాజవొమ్మంగి: పంచాయతీలో పారిశుధ్య పనులు ముమ్మురంగా చేపడుతున్నారు. ముఖ్యంగా రాజవొమ్మంగి నుంచి అప్పలరాజుపేట వెళ్లే దారిలో పేరుకొని పోయిన చెత్తను పంచాయతీ సిబ్బంది పొక్లెయిన్ సహాయంతో తొలగించి వ్యర్థాలను ట్రాక్టర్లపై వేసి దూరంగా డంప్ చేస్తున్నారు. అలాగే ఈ ప్రాంతంలో చెత్త వేయవద్దని బోర్డులు ఏర్పాటు చేశారు. విచ్చలవిడిగా చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని, అపరాధ రుసుము విధించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. పారిశుధ్యం మెరుగుకు గ్రామస్తులంతా కృషి చేయాలని కోరుతున్నారు.



# పొంగిన గెడ్డలు... నిలిచిన రాకపోకలు

- లోతట్టుప్రాంతాలు జలమయం
- పొలాలను ముంచెత్తిన వరదనీరు



కుమడ నుంచి భూసిపుట్టు వెళ్లే మార్గంలో కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు



మత్స్యగుండలో ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ



జి.మాడుగుల మండలం బొయితిలి ప్రాంతంలో నీట మునిగిన పొలాలు

సాక్షి,పాడేరు: జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పవిత్ర పుణ్యక్షేత్రం మత్స్యగుండంలో వరద నీరు పొంగిప్రవహిస్తుండడంతో భక్తులంతా భయాందోళన చెందారు. హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేశారు. ఈదురుగాలులు కూడిన వర్షాలతో పాడేరు జూనియర్ విద్యుత్ స్తంభం ఒరిగిపోయింది. దీంతో విద్యుత్ అధికారులు వెనువెంటనే స్పందించి, పునరుద్ధరణ పనులు చేపట్టారు.

పెదబయలు: మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు కొండగెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. కిముడుపల్లి పంచాయతీ గేదెగెడ్డ, జి.మాడుగుల నుంచి ముంచంగిపుట్టు వరకు ప్రవహించే మత్స్యగెడ్డ, గోమంగి, గుల్లేలు, పోయిపల్లి, గిన్నెలకోట, జామిగుడ, ఇంజరి పంచాయతీల మీదుగా ప్రవహించే గుంజివాడ గెడ్డలు ఉప్పొంగాయి. వీటివల్ల జామిగుడలో పంచాయతీలో ఆరు గ్రామాలు, గిన్నెలకోటల పంచాయతీలో మరో ఆరు గ్రామాలు, గుల్లెలు పంచాయతీలో ఒక గ్రామానికి మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి. జామిగుడ గెడ్డ ఉధృతంగా పొంగి ప్రవహిస్తోంది. జామిగుడలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి గుంజివాడ, తారాబు, చింతల వీధి, జడిగుడ, గబ్బర్ల, సరిగిగుడ గ్రామాల నుంచి ప్రజలు హాజరు కాలేకపోయారు. రంగలోయ ప్రాంతాల్లో వరి పొలాలు నీటమునిగాయి.

**పొంగిన చాపరాయి, సంపంగి..**

దుంబ్రిగుడ: మన్యంలో మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని సంపంగిగెడ్డ, చాపరాయి గెడ్డ ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గెడ్డలకు అవతలి పక్కన ఉన్న గిరిజనులు బయటకు రాలేక ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం జరిగిన వారపు సంతకు రాలేకపోయారు.

**ప్రధాన రహదారిపై నిలిచిన వరదనీరు**

అరకులోయ రూరల్: భారీ వర్షాలలకు రహదారులు జలమయం అయ్యాయి.అరకు-పాడేరు ప్రధాన రహదారులైన సినిమాహాల్ వంతెన , యండపలి వలస గంగమ్మతల్లి గుడి ఎదురుగా రహదారిలో వరదనీరు నిలిచిపోయింది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

**కల్వర్టుపై నుంచి ఉధృతంగా ప్రవాహం**

ముంచంగిపుట్టు: మండలంలోని కుమడ పంచాయతీ కేంద్రం నుంచి భూసిపుట్టు వెళ్లే మార్గంలో బల్లుగూడ జంక్షన్ వద్ద కల్వర్టుపై నుంచి బుధవారం ఉదయం భారీగా వరదనీరు ప్రవహించింది. దీంతో కుమడ నుంచి భూసిపుట్టు పంచాయతీ కేంద్రానికి సుమారు నాలుగు గంటలపాటు రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీటి ఉధృతికి కల్వర్టుకు పక్కనున్న పంట పొలాలు కోతకు గురయ్యాయి. కల్వర్టుపై నుంచి వరద నీటిని దాటుకుని భయంభయంగా రాకపోకలు సాగించారు.మాకవరం పంచాయితీ లబడపుట్టులో అడకటియ రాజు అనే గిరిజనుడి ఇంటి మట్టిగోడలు ఒరిగిపోవడంతో నేలమట్టమైంది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు రాజు కోరాడు.

**జిల్లావ్యాప్తంగా 932.4 ఎంఎం వర్షపాతం నమోదు**

సాక్షి, పాడేరు: జిల్లాలోని 22 మండలాల పరిధిలో 932.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముంచంగిపుట్టులో 86.7, జి.మాడుగులలో 68.1, పాడేరులో 66.8, చింతూరులో 65.5, జీకేవీధిలో 62.5, దుంబ్రిగుడలో 59.9 ఎంఎం వర్షపాతం నమోదైందని అధికారవర్గాలు తెలిపాయి. ఎటపాక మండలంలో 46.3, హుకుంపేటలో 46.4, కూనవరంలో 46.7, చింతపల్లిలో 43.4, మారేడుమిల్లిలో 39.4, అరకులోయలో 37.6, అనంతగిరిలో 36.1, అడ్డతీగలలో 34.4, కొయ్యూరులో 33.8, వై.రామవరంలో 33.1, రాజవొమ్మంగిలో 28.7, రంపచోడవరం 25.9, పెదబయలులో 22.6, వీ.ఆర్‌పురంలో 27.7, గంగవరంలో 16.7, దేవీపట్నంలో 12 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని పేర్కొన్నాయి.

**రోడ్డుపై కూలిన చెట్లు**

మోతుగూడెం: పోర్‌బై సమీపం వద్ద చెట్లు రోడ్డుపై పడడంతో మోతుగూడెం నుంచి సీలేరు వైపు వెళ్లే రహదారిలో రాకపోకలు స్తంభించాయి. బుధవారం ఉదయం నుంచి భారీ వర్షం కురవడంతో పోర్‌బై గ్రామం సమీపంలో చెట్లు విరిగి రోడ్డుపై పడడంతో విశాఖపట్నం నుంచి వచ్చే నైట్ సర్వీసు బస్సులు తెల్లవారు జాము నుంచి ఉదయం 7 గంటల వరకు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సీలేరు నుంచి వచ్చే రాజమహేంద్రవరం బస్సు కూడా సుమారు 3 గంటలు నిలిచిపోయింది. రోడ్డుపై చెట్లు పడి ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఏపీ జెన్‌కో సిబ్బంది , స్థానికుల సహాయంతో చెట్లు తొలగించారు. దీంతో బస్సు సర్వీసులు యథావిధిగా నడిచాయి.

**కల్వర్టుకు గండి**

జి.మాడుగుల: మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. బొయితిలి, నుర్మతి, జి.మాడుగుల, వంజరి, భీరం పంచాయతీల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. మద్దిగరువు, నుర్మతి, భీరం పంచాయతీల్లో గెడ్డలు పక్కనున్న వరి పొలాలు నీటమునిగాయి. మద్దిగరువు–బొయితిలి, కిల్లంకోట మార్గం మధ్యలో తాత్కాలికంగా వేసిన కల్వర్టుకు గండి పడి మట్టిరోడ్డు వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో సుమారు 25 గ్రామాలకు వాహన రాకపోకలు స్తంభించాయి.



కోతులగుట్ట పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



పోశమ్మగండి వద్ద రహదారి వద్దకు చేరిన గోదావరి వరదనీరు, పర్యాటక బోట్లు



పొంగి ప్రవహిస్తున్న సంపంగి గెడ్డ

### ముంపు ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలి

వీఆర్ పురం: గోదావరి- శబరి నదులకు వరద నీరు పెరుగుతున్న క్రమంలో పరివాహక గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీధర్ బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. ముంపు ప్రభావిత గ్రామాల్లో ప్రజలను అవసరం మేరకు పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నామని, బఫర్ స్టాక్ పంపిణీకి రేషన్ డీలర్లను ఆదేశించామన్నారు.

### ఆత్మీయ వీడ్కోలు



నాయుడుని సన్మానిస్తున్న సర్పంచ్ రాంబాబు తదితరులు

జి.మాడుగుల: మండల కేంద్రంతో పాటు పలు పంచాయతీల్లో సుదీర్ఘకాలం పనిచేసి అనకాపల్లి జిల్లా రావికమతం మండలానికి బదిలీ వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి నాయుడును సిబ్బంది, సర్పంచ్ రాంబాబు తదితరలు బుధవారం సన్మానించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

### శునకాల బెడద.. ఆందోళనలో విద్యార్థులు



విద్యార్థిని బ్యాగ్‌ను పాడుచేసిన కుక్కలు

అనంతగిరి: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల-1 పాఠశాలలో శునకాల బెడదతో విద్యార్థినిలు భయాందోళన చెందుతున్నారని, గిరిజన సంఘం మండల కార్యదర్శి సుబ్బారావు తెలిపారు. పాఠశాలల్లో పెద్ద ఎత్తున శునకాలు సంచరిస్తున్నాయని, విద్యార్థులు బ్యాగులు, పుస్తకాలు పాడుచేస్తున్నాయన్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడద లేకుండా చూడాలని కోరారు.

# సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కొమ్మికలో గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, నాయకులు



పెనికలపాడులో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

కొయ్యూరు: సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కొమ్మిక గ్రామ సచివాలయం పరిధిలోని ఊరలోది, గంగవరం, తాళ్లపాలెం, కొమ్మిక, రేవళ్లలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 254 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అర్హులై ఉండి పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకొని రావాలని ప్రజలను కోరారు. గతంలో మాదిరిగా సంక్షేమ పథకాలు అందాలంటే లంచాలు ఇవ్వాల్సిన అగత్యం లేదని ప్రజలకు వివరించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయం అన్నారు. ఎంపీపీ బడుగు రమేష్, సర్పంచ్ సెగ్గే సూరిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు కమటం అర్జమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, ఏఎంసీ చైర్ పర్సన్ జైతి రాజులమ్మ, బీసీ డైరెక్టర్ గాడి నాగమణి, వైస్ ఎంపీపీలు వెంకటరమణ, నూకాలమ్మ, జిల్లా ప్రచారక్ కమిటీ అధ్యక్షుడు బాబ్జి, సావిత్ర, నాయకులు ముసలి నాయుడు, అచ్చుత్, గజ్జయ్యదొర, వనంబాబు పాల్గొన్నారు.

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు**

దేవీపట్నం: అర్హత కల్గిన ప్రతిపేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబులు తెలిపారు. దేవీపట్నం మండలంలోని మంటూరు పంచాయతీలో పెనికలపాడు కాలనీలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 120 గడపలను సందర్శించారు. ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు శిరశం సత్యవేణి, నాయకులు కందుల బాబ్జి, కట్టా సత్యనారాయణ, గారపాటి మురళీ, శిరశం పెద్దబ్బాయిదొర తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పనులకు శంకుస్థాపన

గూడెంకొత్తవీధి: మండలంలోని నూతుల గ్రామ రహదారి నిర్మాణానికి ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, కో-ఆప్షన్ సభ్యుడు దావీద్ తదితరులు బుధవారం శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికు స్థానికులు రోడ్డు కోసం విన్నవించగా, తక్షణమే స్పందించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఈ మేరకు ప్రభుత్వం రోడ్డు కోసం రూ.30లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. నాయకుడు అరుణ్, గ్రామ వలంటీర్ సాయిపవన్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

# విత్తన శుద్ధిపై అవగాహన



చవిటిదిబ్బలులో విత్తనశుద్ధిపై రైతులకు శిక్షణ ఇస్తున్న ఏవో ఉషారాణి



ముర్లవానిపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో రమేష్‌నాయుడు

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు గ్రామంలో బుధవారం ఏఓ ఉషారాణి ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో ఉషారాణి మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విత్తన శుద్ధిపై ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు.యాజమాన్య పద్ధతిలో ప్రకతి వ్యవసాయం చేయడం, సేంద్రియ ఎరువులు తయారీ, వినియోగం వలన కలిగే ప్రయోజనాలు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించే విధానం తదితర అంశాలపై పూర్తి అవగాహన కల్పించారు. వీఏఏలు, వీహెచ్ఏలు, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

**పంటల సాగుపై రైతులకు అవగాహన**

రాజవొమ్మంగి: మండలంలోని ముర్లవానిపాలెంలో మండల వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి ప్రారంభించారు. రైతులకు వివిధ పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికి ఒకసారి చొప్పున ఈ కార్యక్రమం 14 వారాల పాటు జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం విధానం, సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. సాగులో రైతులను పూర్తి అనుభవజ్ఞులుగా తీర్చిదిద్దడమే పొలంబడి లక్ష్యం అన్నారు.



బొయితిలిలో వరినాట్లను పరిశీలిస్తున్న రైతు సాధికార సంస్థ రాష్ట్ర ప్రతినిధి రమాప్రభ

జి.మాడుగుల: ఏజెన్సీలో ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులు దృష్టి సారించి అధిక దిగుబడులు సాధించాలని ప్రకృతి వ్యవసాయం విభాగ రైతు సాధికార సంస్థ రాష్ట్ర ప్రతినిధి(ఆర్‌సీపీ)రమాప్రభ తెలిపారు. మండలంలో ఎం.నిట్టాపుట్టు యూనిట్ పరిధిలో బొయితిలి, ఎం.నిట్టాపుట్టు గ్రామాల్లో బుధవారం రైతుల ప్రకృతి వ్యవసాయం సాగును ఆమె పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు యూనిట్ సిబ్బంది అందిస్తున్న శిక్షణ, పంటలపై అవగాహన, దిగుబడులు, వరిసాగులో మెలకవలు తదితర అంశాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. బొయితిలిలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వేసిన వరినాట్లు లైన్‌షోయింగ్ పద్ధతిని ఆమె పరిశీలించారు. అనంతరం ఎఫ్‌పీవో గిరిజన రైతు సేవా, ఉత్పత్తిదారుల మాక్స్ లిమిటెడ్ సీఈవోతో ఆమె చర్చించారు. వెంకట్, రామలింగం, ప్రసాద్, రాజుపడాల్, రైతులు పాల్గొన్నారు.

# జగనన్న సురక్షతో సమస్యలకు శాశ్వత పరిష్కారం



జామిగుడలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో, ప్రజాప్రతినిధులు తదితరులు



తాజంగిలో గిరిజనులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ అనూషదేవి తదితరులు



చెరకుంపాలెంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



లక్కొండలో పత్రాలు పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు



చూచిరేవులగూడెంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

పెదబయలు/జీకే వీధి/చింతపల్లి రూరల్: అల్లూరి జిల్లా వ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. అరకు, పాడేరు నియోజకవర్గాల్లోని పెదబయలు, గూడెం కొత్తవీధి, చింతపల్లి మండలాల్లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తోందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. పెదబయలు మండలం మావోయిస్టు ప్రభావిత ప్రాంతం జామిగుడలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జె.సూర్యనారాయణ, నాయకులు ఉమామహేశ్వరరావు, సూరయ్య తదితరులు పాల్గొన్నారు. చింతపల్లి మండలం తాజంగి, కొత్తపాలెంలో ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య, ఎంపీడీవో ఆశాజ్యోతి, తహసీల్దార్ పాత్రుడు, సర్పంచ్‌లు మహేశ్వరి, సోమరత్నం తదితరులు పాల్గొన్నారు.జీకే వీధి మండలం గుమ్మిరేవులులో ఎంపీపీ కుమారి, సర్పంచ్ ఎం.కమలమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు జ్ఞానమణి, తహసీల్దార్ ప్రసాద్, పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు బుజ్జి, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం/మారేడుమిల్లి/అడ్డతీగల/వీఆర్ పురం/రాజవొమ్మంగి/వై.రామవరం/కూనవరం: రంపచోడవరం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైంది. పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ జగనన్న సురక్షతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. గంగవరం మండలం లక్కొండలో ఎంపీపీ పి.కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, వైస్ ఎంపీపీ గంగాదేవి, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీమన్నారాయణ, సర్పంచ్‌లు ప్రతాప్‌రెడ్డి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు. మారేడుమిల్లి మండలం డి.వి.కోటలో ఎంపీపీ ఎస్.లలితకుమారి, సర్పంచ్ సోమాలమ్మ, ఎమ్మార్వో టి.శ్రీనివాసరావు, ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు బాలాజీబాబు, వైస్ ఎంపీపీ తుమ్మడు, సర్పంచ్ కాసులమ్మ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అడ్డతీగల మండలం డి.భీమవరంలో సర్పంచ్‌లు శంకరబాబు, పెద్దబ్బాయి, ఎంపీటీసీ లోవరాజు, ఎంపీడీవో బాపన్నదొర తదితరులు పాల్గొన్నారు. వి.ఆర్.పురం మండలం జీడిగుప్పలో సచివాలయం మండల ఇన్‌చార్జి సత్యనారాయణ, ఎంపీడీవో రత్నకుమారి, సర్పంచ్ బాలరాజు, జిల్లా వ్యవసాయశాఖ పాలక మండలి సభ్యుడు శ్రీనివాస్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్‌మానిటరింగ్ సభ్యుడు బాలు తదితరులు పాల్గొన్నారు. రాజవొమ్మంగి మండలంలో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి, సర్పంచ్ నాగేశ్వరరావు, జెడ్పీటీసీ జ్యోతి, సర్పంచ్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. వై.రామవరం మండలంలోని కోటలో ఎంపీపీ కె.ఆనందరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, డీటీ సుధాకరరావు, సర్పంచ్ చిన్నారావు, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కూనవరంలో జెడ్పీటీసీ విజయ, సర్పంచ్ రామయ్య, ఎంపీటీసీ జయసుధ, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

### రింతాడలో వైద్య శిబిరం

గూడెంకొత్తవీధి: మండలంలోని రింతాడలో వైద్యాధికారి వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 150 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తను తెలియజేశారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.